సాక్షి మహబూబాబాద్

గురువారం | 13 | జూలై | 2023



విద్యార్థుల పరారీపై విచారణ
మల్లంపల్లి శివారులోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి విద్యార్థులు పరారైన ఘటనపై బుధవారం అధికారులు విచారణ చేపట్టారు. - 8లో▸



ఆర్టీసీ అప్పను ఈక్విటీగా మార్చాలి
టీఎస్ ఆర్టీసీ అప్పను ప్రభుత్వ ఈక్విటీగా మార్చాలని ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ చైర్మన్ శ్రీనివాస్ డిమాండ్ చేశారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
30.8° /23.3°

వాతావరణం
జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరుజల్లుల నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉంది.

టికెట్ పే చర్చ!

బీఆర్ఎస్ డోర్నకల్ టికెట్‌పై ఊహాగానాలు
- మళ్లీ రెడ్యానాయక్ బరిలో నిలిచే అవకాశం
- ఆయన కూతురు ఎంపీ కవితకు చాన్స్ ఇస్తారని చర్చ
- తానే పోటీలో ఉంటానని ప్రకటించిన స్థానిక ఎమ్మెల్యే
- మొన్నటి వరకు మంత్రి సత్యవతిరాథోడ్‌కు అవకాశం ఉందనే ప్రచారం



సాక్షి, మహబూబాబాద్: రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల సందడి మొదలైంది. అధికార బీఆర్ఎస్ పార్టీలో ప్రతీ నియోజకవర్గం నుంచి ఆశావహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో టికెట్ ఎవరిని వరిస్తుందోనని తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో డోర్నకల్ టికెట్ సిట్టింగ్ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్‌కు కేటాయిస్తారా.. లేదా ఆయన కూతురు మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితను బరిలో నిలుపుతారా అనేది చర్చగా మారింది. అయితే తానే పోటీలో ఉంటానని రెడ్యానాయక్ తెలపడంతో డోర్నకల్ రాజకీయాలు రసవత్తరంగా మారాయి. ఇదిలా ఉండగా నిన్న, మొన్నటి వరకు సీఎం కేసీఆర్ ఆదేశిస్తే డోర్నకల్ నుంచి పోటీ చేస్తానని చెప్పిన మంత్రి సత్యవతిరాథోడ్ పరిస్థితి ఏమిటనేది చర్చగా మారింది.

గెలుపోటములపై చర్చ..

నిన్న, మొన్నటి వరకు మంత్రి సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యే రెడ్యానాయక్ మధ్య డోర్నకల్ టికెట్ విషయంపై చర్చ జరుగగా.. అనూహ్య రాజకీయ పరిణామాల నేపథ్యంలో సత్యవతి స్థానంలో ఎంపీ కవిత తెరపైకి వచ్చింది. 2009లో తప్పితే.. పోటీ చేసిన ప్రతీసారి ఓటమెరుగని నాయకుడిగా రెడ్యానాయక్‌కు పేరుంది. అయితే ఇటీవల ఆయన నియోజకవర్గంలో పర్యటిస్తున్న సమయంలో నిరసనలు, నిలదీయడం, అడ్డగింతలు వంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. చిన్నచిన్న విషయాలకు రెడ్యానాయక్ అసహనానికి గురవుతున్నారని పార్టీ నాయకులే చెబుతున్నారు. మరోవైపు కాంగ్రెస్ నాయకులు డోర్నకల్‌లో ఎలాగైనా గెలిచితీరాలనే దృఢ సంకల్పంతో ఉన్నారు. దీనికి తోడు ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన కాంగ్రెస్ సభకు డోర్నకల్ నుంచి భారీగా జనాలు తరలివెళ్లారు. ఇలాంటి పరిస్థితుల్లో ఎమ్మెల్యే ఓటు బ్యాంకు చీలిపోయే అవకాశం లేకపోలేదు. కాగా రెడ్యానాయక్‌పై ఉన్న వ్యతిరేకత ఆయన కూతురు కవితపై ఉండకపోవచ్చనే భావనతోనే.. ఆమెకు టికెట్ ఇచ్చేందుకు సంకేతాలు అందాయని పార్టీ వర్గాల్లో తీవ్ర చర్చ సాగుతోంది. ఈ రాజకీయ పరిణామాల నేపథ్యంలో తానే బరిలో నిలిచి గెలుస్తానని రెడ్యానాయక్ చెప్పడం గమనార్హం. అయితే తండ్రి, కూతుర్లలో ఎవరో ఒకరు బరిలో నిలిస్తే మంత్రి సత్యవతిరాథోడ్ వీరికి మద్దతుగా ప్రచారం చేసి గెలుపునకు కృషి చేస్తుందా.. లేదా చివరి నిమిషంలో తానే టికెట్ తెచ్చుకొని బరిలో నిలుస్తుందా అనేది చర్చ జరుగుతోంది.

ఇద్దరిలో విశ్వాసం

వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నుంచి డోర్నకల్ నియోజకవర్గంలో బరిలో నిలుస్తామని ఎమ్మెల్యే రెడ్యానాయక్, మాలోత్ కవిత ఎవరికి వారుగా విశ్వాసంతో ఉన్నట్లు ప్రచారం. గత నెల 30వ తేదీన రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ జిల్లాలో పర్యటించి, పోడు పట్టాలు పంపిణీ చేశారు. ఆయన వచ్చి వెళ్లిన తర్వాత జిల్లా రాజకీయాల్లో మార్పులు వచ్చినట్లు స్పష్టమవుతోంది. ఈ సందర్భంగా కేటీఆర్ డోర్నకల్ నుంచి ఎంపీ మాలోత్ కవిత పోటీ చేస్తుందనే సంకేతాలు ఇచ్చినట్లు తెలిసింది. అయితే ఇటీవల రెడ్యానాయక్ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసిన సందర్భంలో మరోసారి రెడ్యానాయక్ పోటీలు ఉంటారని చెప్పినట్లు ప్రచారం. సీఎం కేసీఆర్ హామీతో రెడ్యానాయక్, మంత్రి కేటీఆర్ సంకేతాలతో కవిత ఎవరికి వారుగా టికెట్ వస్తుందనే ఆశాభావంతో ఉన్నట్లు తెలిసింది.

ఇంత నిర్లక్ష్యమా..?

ఉర్దూ పాఠశాలలపై ప్రభుత్వం చిన్నచూపు
- ఉపాధ్యాయుల కొరతతో విద్యార్థుల ప్రైవేట్ బాట
- శిథిలావస్థలో తరగతి గదులు
- పట్టించుకోని అధికారులు



పాఠశాలకు హాజరైన విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలో ఉర్దూ పాఠశాలల పరిస్థితి అధ్వానంగా మారింది. విద్యాబోధనపై నిర్లక్ష్యపు నీడలు అలుముకున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం మన ఊరు–మన బడి పథకం ద్వారా సర్కారు బడులను బాగు చేస్తూ నాణ్యమైన విద్య అందించడానికి చర్యలు చేపడుతోంది. ఆధునిక టెక్నాలజీ సాయంతో ఇంగ్లిష్ మీడియంలో డిజిటల్ తరగతుల బోధన, మెరుగైన సౌకర్యాలు కల్పిస్తోంది. ఇందుకు భిన్నంగా జిల్లాలోని ఉర్దూ పాఠశాలలను మాత్రం పట్టించుకోవడం లేదు. సౌకర్యాల లేమి, ఉపాధ్యాయుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. ఉర్దూ పాఠశాలలపై విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ముస్లిం పేద విద్యార్థులకు చదువును దూరం చేస్తున్నారు.

అరకొర వసతులు..

జిల్లాలోని 5 ఉర్దూ పాఠశాలల్లో వసతులు కరువయ్యాయి. తరగతి గదులు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో పిల్లలను పంపడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఇకనైనా పేద ముస్లిం విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని జిల్లా విద్యాశాఖ అధికారులు ఉర్దూ పాఠశాలల్లో వసతులు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఉపాధ్యాయుల కొరత..

జిల్లాలో కేసముద్రం, కురవి, తొర్రూరు, జిల్లా కేంద్రంలో ఉర్దూ పాఠశాలలు ఉన్నాయి. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు ఉంటే ఉపాధ్యాయులు ఉండరు.. ఉపాధ్యాయులు ఉంటే విద్యార్థులు ఉండరు. కొన్ని చోట్ల విద్యార్థులు అసలే లేరు. కాగా జిల్లా కేంద్రంలోని రామస్ ఉర్దూ మీడియం హైస్కూల్ ఒకటి మాత్రమే ఉంది. ఇందులో ఎనిమిది మంది ఉపాధ్యాయులు, 28 మంది విద్యార్థులు ఉన్నట్లు యూడైస్ చూపిస్తుంది. కానీ పాఠశాలకు వెళ్లి చూస్తే ఇంగ్లిష్, మ్యాథ్స్, పీఈటీ, రికార్డు అసిస్టెంట్ మాత్రమే విధులు నిర్వహిస్తున్నారు. సోషల్, తెలుగు, ఉర్దూ, సైన్స్ ఉపాధ్యాయులు లేకపోవడంతో విద్యార్థులు ప్రైవేట్ పాఠశాలలు, ఇతర ఉర్దూ మీడియం, మైనార్టీ గురుకులాల బాట పడుతున్నారు.

పిల్లలు ఆసక్తి చూపడం లేదు



ఉర్దూ పాఠశాలల్లో ఉపాధ్యాయులు లేకపోవడంతో ముస్లిం విద్యార్థులు అడ్మిషన్లు పొందడానికి అంతగా ఆసక్తి చూపడం లేదు. పాఠశాల భవనం కూడా శిథిలావస్థకు చేరింది. స్లాబ్ పెచ్చులూడి విద్యార్థులపై పడుతున్నాయి. అధికారులు పాఠశాలలపై దృష్టి సారించి విద్యార్థుల విద్యాభివృద్ధికి తోడ్పడాలి.
– ఆయూష్‌కౌసర్, ఉపాధ్యాయురాలు, రామస్ హైస్కూల్

పెచ్చులూడి పడుతున్నాయి..



పాఠశాలల్లో ఉర్దూ ఉపాధ్యాయులు లేకపోవడంతో చదవడానికి ఇబ్బంది అవుతుంది. గతంలో ఉర్దూ ఉపాధ్యాయులు ఉన్నారనే మా తల్లిదండ్రులు ఈ పాఠశాలలో చేర్పించారు. ప్రస్తుతం పాఠశాలకు రావాలంటేనే భయం వేస్తోంది. స్లాబ్ పైనుంచి అప్పుడప్పుడు పెచ్చులూడి పడుతున్నాయి.
– ఎండీ.సనా, 9వ తరగతి, రామస్ హైస్కూల్, మానుకోట

న్యూస్‌రీల్

నేరస్తులకు శిక్ష పడాలి
- ఎస్పీ శరత్‌చంద్ర పవార్



మహబూబాబాద్ రూరల్: దర్యాప్తులో ఉన్న కేసులలో సమగ్ర విచారణ చేపట్టి నేరస్తులకు శిక్షపడేలా పోలీస్ అధికారులు కృషి చేయాలని ఎస్పీ శరత్‌చంద్ర పవార్ అన్నారు. మహబూబాబాద్ టౌన్ పోలీస్‌స్టేషన్ సమావేశ మందిరంలో బుధవారం డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలతో నెలవారి నేరసమీక్ష సమావేశం నిర్వహించారు. ముందుగా జిల్లాలోని అన్ని పోలీస్‌స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలు తెలుసుకొని, సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. తమ పరిధిలో జరిగే నేరాలలో పకడ్బందీగా విచారణ చేపట్టి నిందితులకు శిక్షపడేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల విచారణలో నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదని, ప్రతీ కేసులో సమగ్ర విచారణ చేపట్టి బాధితులకు న్యాయం చేకూరేలా చూడాలన్నారు. బ్లూకోల్ట్స్,పెట్రోలింగ్ సిబ్బంది తమకు కేటాయించిన విధులను సక్రమంగా నిర్వర్తించాలని ఆదేశించారు.

నేటి నుంచి మిర్చి కొనుగోళ్లు

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు గురువారం నుంచి పునఃప్రారంభిస్తున్నామని ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రైతుల సౌకర్యార్థం మార్కెట్‌లో మిర్చి కొనుగోళ్లు చేపట్టామని, కోల్డ్ స్టోరేజీలో నిల్వ ఉంచిన మిర్చి శాంపిల్ అనగా రెండు బస్తాలను మార్కెట్ యార్డుకు తీసుకువస్తే వాటికి కూడా ఈ–నామ్ ద్వారా ధర నిర్ణయిస్తామని పేర్కొన్నారు.రైతులు కోల్డ్ స్టోరేజీల వద్ద అమ్ముకోకుండా మార్కెట్ యార్డులోనే అమ్ముకునే సదుపాయం కల్పించామని తెలిపారు. ప్రతీ మంగళ,గురువారాల్లో మాత్రమే మిర్చి క్రయవిక్రయాలు జరుగుతాయని, ఉదయం 9.45గంటల లోపే యార్డులోకి వచ్చి లాట్ ఐడీ తీసుకోవాలన్నారు.

ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓగా హైమావతి

మహబూబాబాద్:జిల్లా సంక్షేమాధికారి(డీడబ్ల్యూఓ)గా పని చేస్తున్న వరలక్ష్మి రెండు నెలల పాటు సెలవుల్లో వెళ్లారు. దీంతో తొర్రూరు సీడీపీఓ హైమావతికి ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించినట్లు ఆ శాఖ అధికారులు బుధవారం తెలిపారు.

పోటీతత్వాన్ని అలవర్చుకోవాలి



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులు పోటీతత్వాన్ని అలవర్చుకొని, చదువులో ప్రతిభకనబర్చాలని డీఈఓ రామారావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో జిల్లాస్థాయి పోస్టర్ మేకింగ్ పోటీలు నిర్వహించారు. కాగా పోస్టర్ మేకింగ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు డీఈఓ బహుమతులు అందజేశారు. ఏసీజీ శ్రీరాములు,జిల్లా సైన్స్ అధికారి అప్పారావు, స్టేట్ రిసోర్స్ సభ్యులు ఆజాద్, చంద్రశేఖర్, వివిధ పాఠశాలల హెచ్ఎంలు,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: జిల్లాలోని అన్ని పాఠశాలల యాజమాన్యాల హెచ్ఎంలు, ప్రిన్సిపాళ్లు, ఎంఈఓలు ఇన్‌స్పైర్ నామినేషన్–2023–24విద్యా సంవత్సరానికి దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ రామారావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతీ పాఠశాలలో ఆరు నుంచి పదో తరగతి చదువుతున్న విద్యార్థులు తయారు చేసిన ఐదు ప్రాజెక్టులను ఎంపిక చేసి ఈనెల 31వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో నామినేషన్లు అప్‌లోడ్ చేయాలన్నారు. పూర్తి వివరాలకు జిల్లా సైన్స్ అధికారి అప్పారావును 98495 98281 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

చర్యలు తీసుకుంటాం

మహబూబాబాద్: జిల్లా కేంద్రంలోని ఓ ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లో అంగన్‌వాడీ కోడిగుడ్లు వినియోగిస్తున్నారని సాక్షిలో వచ్చిన కథనానికి ఇన్‌చార్జ్ డీడబ్ల్యూఓ హైమావతి బుధవారం స్పందించారు. ఆమె ఆదేశాల మేరకు మానుకోట ప్రాజెక్ట్ సీడీపీఓ డెబోరా, సూపర్‌వైజర్ ఉషారాణి ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌కు వెళ్లి విచారణ చేశారన్నారు. మరోసారి విచారణ చేసి తగు చర్యలు తీసుకుంటామన్నారు.

మానుకోట డీఎస్పీగా సత్యనారాయణ

మహబూబాబాద్ రూరల్: మానుకోట డీఎస్పీగా సత్యనారాయణను బదిలీ చేస్తూ రాష్ట్ర పోలీస్‌శాఖ ఉన్నతాధికారులు బుధవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ ట్రాఫిక్–2 ఏసీపీగా పని చేస్తున్న సత్యనారాయణను మానుకోట డీఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవాలి
- కలెక్టర్ శశాంక



మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో ఆయిల్‌పామ్ తోటల సాగు లక్ష్యాన్ని చేరుకోవాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం ఆయిల్‌పామ్ సాగు ఇతర అంశాలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లా నేలలు ఆయిల్‌పామ్ సాగుకు అనుకూలంగా ఉన్నాయని, అందుకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. జిల్లాలో 7వేల ఎకరాల సాగు లక్ష్యం కాగా..5వేల ఎకరాల్లో సాగు అవుతుందన్నారు. కాగా సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలన్నారు. జిల్లాలో 4.50లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతుండగా.. అందులో 2.50 లక్షల ఎకరాల్లో రైతులు వరి సాగు చేస్తున్నట్లు తెలిపారు. అయితే ఆయిల్‌పామ్ తోటల సాగుతో రైతులకు ప్రయోజనకరంగా ఉంటుందని.. కోతులు, పందుల బెడద ఉండదన్నారు. రైతులు ఎరువులు, విత్తనాల కొనుగోళ్ల సమయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అధికారులు తొర్రూరు, కొత్తగూడ, మరిపెడలో ఎక్కువగా నిఘా పెట్టాలన్నారు. జిల్లాలో 3,5000 మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా.. 2,2851 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందన్నారు. అర్హులైన పోడు రైతులందరికీ రైతుబంధు అందేలా చూడాలన్నారు. కచ్చితత్వంతో పంటల నమోదు చేపట్టాలన్నారు. సమావేశంలో డీఏఓ ఛత్రునాయక్, జిల్లా ఉద్యాన శాఖాధికారి సూర్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

సీజనల్ వ్యాధులపై ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో బుధవారం సీజనల్ వ్యాధులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తిచెందే అవకాశం ఉందని, అధికారులు ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. జ్వరంతో బాధపడే వారిని గుర్తించి రక్త నమూనాలను సేకరించాలన్నారు. గ్రామాల్లో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా చేయాలని ఆదేశించారు. సమీక్షలో అదనపు కలెక్టర్ అభిలాష అభినవ్, డీఎంహెచ్ఓ హరీశ్‌రాజ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

కష్టపడి ఉన్నతస్థాయికి ఎదగాలి



మహిళలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ

మహబూబాబాద్ అర్బన్: యువత కష్టపడి ఉన్నతస్థాయికి ఎదగాలని ఎమ్మెల్సీ తక్కెళ్లపల్లి రవీందర్‌రావు అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో దైవకృప అనాథ ఆశ్రమం ఆధ్వర్యంలో బుధవారం నిరుద్యోగ యువతకు నిర్వహించిన ఉపాధి నైపుణ్య శిక్షణ అవగాహన కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు.ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించేందుకు, వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ఉపాధి శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన 30లక్షల మంది తెలంగాణలోని వివిధ రంగాల్లో ప్రభుత్వ సహకారంతో ఉపాధి పొందుతున్నారన్నారు. ప్రైవేటు, ప్రభుత్వ సంస్థల్లో చిన్న ఉద్యోగం వచ్చినా చేరాలని, కష్టపడి పనిచేసే వారికి ఎప్పటికైనా గుర్తింపు ఉంటుందన్నారు. దైవకృప అనాథ ఆశ్రమం ఆధ్వర్యంలో మహిళలు, యువకులకు కుట్టుమిషన్‌లో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం అభినందనీయమన్నారు. అనంతరం సుమారు 100మందికి శిక్షణ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధి శిక్షణ జాయింట్ డైరెక్టర్ నగేష్, దైవకృప వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు బానోత్ లోకేష్, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, సభ్యులు డేవిడ్, పరికిపండ్ల అశోక్, ఉపాధి శిక్షణ అధికారులు నసీర్ సిద్దిక్, కో ఆర్డినేటర్ కోటేష్, కౌన్సిలర్లు ఎడ్ల వేణుమాధవ్, ఆరెంపుల విజయ, హరిసింగ్, శంతన్ రామరాజు పాల్గొన్నారు.

క్రీడలతో ఉజ్వల భవిష్యత్



ఎంపికలు నిర్వహిస్తున్న డీవైఎస్ఓ అనిల్, పీఈటీలు

మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు క్రీడలతో ఉజ్వల భవిష్యత్ ఉంటుందని జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి అనిల్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జిల్లాస్థాయి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారి అనిల్ కుమార్ మాట్లాడుతూ.. క్రీడల్లో రాణించాలనుకునే వారికి స్పోర్ట్స్ స్కూల్ ఎంపికలు మంచి అవకాశమన్నారు. ఎంపికైన విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ ఇస్తూనే పదో తరగతి వరకు ఉచిత విద్య, వసతి కల్పిస్తారన్నారు. కాగా ఎంపికలకు సుమారు 110మంది విద్యార్థులు హాజరయ్యారు. కార్యక్రమంలో బాస్కెట్‌బాల్ కోచ్ వెలిశాల కుమార్‌స్వామి, పీఈటీలు వెంకటేశ్వర్లు, సింధువర్మ, పిల్లి కాశీనాథ్, పద్మావతి, పుష్పలీలా, ప్రవీణ్, రాజాకుమారి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం సాధించాలి
- రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు



మాట్లాడుతున్న వి.హనుమంతరావు

మహబూబాబాద్ రూరల్: బీసీలు రాజ్యాధికారం సాధించేవరకు కలిసికట్టుగా పోరాడాలని రాజ్యసభ మాజీ సభ్యుడు వి.హనుమంతరావు పిలుపునిచ్చారు. బీసీ ఐక్య వేదిక ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ హయాంలో మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ పేదలకు పంచిన భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం బలవంతంగా లాక్కొంటుందని మండిపడ్డారు. బీసీ జనగణన చేపడుతామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఇచ్చిన సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. త్వరలో సూర్యాపేటలో లక్షలాది మందితో బీసీగర్జన సభ నిర్వహిస్తామని, ఈ సభకు కర్ణాటక సీఎం సిద్ధరామయ్యను ఆహ్వానిస్తామన్నారు. దేశంలో బీసీ జనాభా 70కోట్లు, తెలంగాణలో 54శాతం ఉన్నారని, అయినప్పటికీ తమకు న్యాయం జరగడంలేదని వాపోయారు. చట్ట సభల్లో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు దక్కేవరకు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గంలో బీసీలకు 3అసెంబ్లీ సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రధాని మోదీ తాను ఓబీసీ అంటూనే అధికంగా ఉన్న బీసీలను అన్ని రంగాల్లో అణగదొక్కుతున్నారని ఆరోపించారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన ప్రత్యేకశాఖ ఏర్పాటు చేయాలని, బడ్జెట్ కేటాయించాలని, తమ పిల్లల భవిష్యత్ కోసం చర్యలు తీసుకోవాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అన్నివర్గాల వారికి ప్రాతినిధ్యం కల్పిస్తుందని చెప్పారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ఓబీసీ జిల్లా అధ్యక్షుడు మేకల వీరన్నయాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో టీపీసీసీ అధికార ప్రతినిధి తేజావత్ బెల్లయ్యనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అర్బన్ అధ్యక్షుడు అంజయ్య, మురళీనాయక్, జిన్నారెడ్డి వెంకటేశ్వర్లు, శ్రీను, సోమేశ్వర్‌రావు, దస్రునాయక్, లక్ష్మణ్ యాదవ్, పూర్ణ, స్వర్ణలత, ప్రభాకర్, నాగేశ్వర్‌రావు, రామరాజు, సీతారాములు, వెంకటి, ప్రతాప్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

రైతులను గోస పెట్టిన చరిత్ర కాంగ్రెస్‌ది..
- ఎంపీ మాలోత్ కవిత



రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు

మహబూబాబాద్: గతంలో విద్యుత్ ఇవ్వకుండా రైతులను గోసపెట్టిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని ఎంపీ మాలోత్ కవిత అన్నారు. మానుకోట పట్టణంలోని ఎంపీ క్యాంపు కార్యాలయం సమీపంలో సాగుకు 24గంటల ఉచిత కరెంట్ అవసరం లేదంటూ వ్యాఖ్యానించిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను బీఆర్ఎస్ నాయకులు దహనం చేశారు. ఈసందర్భంగా ఎంపీ కవిత మాట్లాడుతూ..రైతులకు ఉచిత విద్యుత్ ఇవ్వొద్దని కాంగ్రెస్ దుర్మార్గపు ఆలోచన చేస్తోందని విరుచుకుపడ్డారు. మరోసారి తన రైతు వ్యతిరేక విధానాలను కాంగ్రెస్ పార్టీ బయటపెట్టుకుందని ఆరోపించారు. తెలంగాణ రైతాంగం అన్ని పరిశీలిస్తోందని, కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పర్కాల శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌పాషా, రాము, వెంకన్న, లక్ష్మణ్, ప్రభాకర్, ప్రవీణ్‌రావు, ప్రవీణ్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లలను ఆదుకుంటాం



అనాథ పిల్లలను పరామర్శిస్తున్న అధికారులు

మహబూబాబాద్/నెల్లికుదురు: తల్లిదండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన నెల్లికుదురు మండలం శ్రీరామగిరి గ్రామానికి చెందిన వర్షిత్‌కుమార్, వర్షితను పరామర్శించినట్లు డీడబ్ల్యూఓ హైమావతి, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ నాగవాణి, బాలల సంరక్షణ అధికారి నరేష్ బుధవారం తెలిపారు. వారిని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ ఎదుట హాజరుపర్చామన్నారు. వర్షిత తొర్రూరు మైనార్టీ పాఠశాలలో ఆరో తరగతి చదువుతుందని, వర్షిత్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశాల మేరకు సోషల్ వెల్ఫేర్ హాస్టల్‌లో ఉంచి చదివిస్తామని చెప్పారు. పిల్లలను అన్ని విధాలా ఆదుకుంటామన్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

నెహ్రూసెంటర్: సీపీఐ నేతలు, పోడు రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి విజయసారథి అన్నారు. పోడు కేసులో భాగంగా బుధవారం కోర్టుకు హాజరయ్యారు. అనంతరం అంబేడ్కర్ సెంటర్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ పోడుసాగుదారుడికి పట్టాలు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ అజయ్‌సారథిరెడ్డి, జిల్లా నాయకుడు తోట భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి

మహబూబాబాద్: సీపీఎస్‌ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. సంబంధిత వాల్‌పోస్టర్లను నాయకులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. పాత పెన్షన్ విధానం పునరుద్ధరణకు కృషి చేయాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో టీఎస్ సీపీఎస్ఈయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నాగముని, లక్ష్మీకాంత్, నాయకులు పాల్గొన్నారు.

రైలునుంచి జారిపడి వ్యక్తి దుర్మరణం

గార్ల: గుర్తుతెలియని రైలు నుంచి జారిపడి గుర్తుతెలియని వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన బుధవారం గార్ల మండలం రాంపురం గ్రామ సమీపంలో జరిగింది. డోర్నకల్ రైల్వే ఎస్సై శ్రీకాంత్ కథనం ప్రకారం కాజీపేట నుంచి విజయవాడ వెళ్లే గుర్తుతెలియని రైలులో సుమారు 45 సంవత్సరాల వయసు కలిగిన గుర్తుతెలియని వ్యక్తి డోర్ వద్ద కూర్చున్నాడు. ఈ క్రమంలో రాంపురం గ్రామ సమీపంలో మలుపు వద్ద రైలు నుంచి జారి దుర్మరణం చెందాడు. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. ఆకుపచ్చ చొక్కా, నల్ల ప్యాంటు ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం అనంతరం మార్చురీలో భద్ర పరిచినట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వృద్ధురాలి మృతి

పెద్దవంగర: అనుమానాస్పద స్థితిలో ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన బుధవారం మహబూబాబాద్ జిల్లా పెద్దవంగర మండలం అవుతాపురంలో జరిగింది. గ్రామానికి చెందిన కూటికంటి శాంతమ్మ (65) కుటుంబ సభ్యులతో ఉంటుంది. మంగళవారం రాత్రి తన కొడుకు కిరాణం వెళ్లి తిరిగి వచ్చే సరికి మృతి చెంది కనిపించింది. సహజ మరణమని భావించిన బంధువులు.. బుధవారం శాంతమ్మ అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్న క్రమంలో ఆమె మృతదేహంపై గాయాలు కనిపించాయి. దీంతో కొడుకు యాకయ్యకు అనుమానం వచ్చి తన భార్యను, ఆమె తమ్ముడిని నిలదీయడంతో వారు అక్కడి నుంచి పరారయ్యారు. దీనిపై యాకయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజు తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి ..

కేసముద్రం: కుటుంబ కలహాలతో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తి.. చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఈ ఘటన మండల కేంద్రంలోని ధన్నసరి శివారు సొలతండాలో జరిగింది. ఎస్సై తిరుపతి కథనం ప్రకారం తండాకు చెందిన ధారావత్ భీమా(45), బద్రి దంపతులకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. గత యేడాది క్రితం పెద్దకూతురి పెళ్లి చేశారు. ఈ క్రమంలో అత్తగారింటి వద్ద గొడవలు తలెత్తడంతో కూతురు తిరిగి ఇంటికి వచ్చి ఉంటుంది. ఈ విషయంతోపాటు, ఆర్థిక ఇబ్బందులతో దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన భీమా ఈనెల 9న పురుగుల మందుతాగి ఆత్మహత్యకుయత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఏరియా ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం అర్ధరాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య బద్రి పిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఆ పాప.. మా బిడ్డ కాదు!

సీడబ్ల్యూసీ, పోలీసుల ఎదుట ఒప్పుకున్న భోజనీ దంపతులు

- అక్రమ దత్తతపై నిజమైన సాక్షి కథనం.. తల్లిదండ్రుల జాడే తెలియాలి
- విరాణి దంపతులపైనా జేజే యాక్ట్ 81 సెక్షన్ కింద కేసు నమోదు
- కొంపల్లిలోని ఓ ఆస్పత్రిలో విక్రయించిన ఆయా రాణి
- ఆమెకు మంచిర్యాల వాసి కృష్ణవేణి ఇవ్వడంతో కేసులో ఇంకో ట్విస్ట్
- శిశువుల అక్రమ రవాణా వెనుక ముఠా ఉందా అనే దిశగా విచారణ
- పోలీసులు పూర్తిస్థాయిలో దృష్టి సారిస్తేనే ఈ కేసు కొలిక్కి వచ్చే చాన్స్


పాపతో సీడబ్ల్యూసీ, జిల్లా బాలల సంరక్షణ విభాగాధికారులు, పోలీసులు

సాక్షి, వరంగల్ : రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన సాక్షిలో వచ్చిన 'ఆ పాప ఎవరూ' అనే కథనం నిజమైంది. ఇంటర్ కంట్రీ అడాప్షన్ పేరెంట్స్ (పాప్స్) నిబంధన కింద దత్తత తీసుకునేందుకు ఏకంగా ఆ పాపకు వరంగల్‌లో ఉంటున్న రషీదాభాను భోజనీ దంపతులను బయోలాజికల్ పేరెంట్స్‌గా ఇన్నాళ్లూ పేర్కొన్నారు. కానీ, ఆ పాప అసలు తల్లిదండ్రులు వారు కాదని తేలింది. స్వయంగా ఆ దంపతులే ఒప్పుకోవడంతో ఆ ఆరు నెలల పాపను అసలు ఎక్కడి నుంచి తీసుకొచ్చారు.. కొనుగోలు చేశారా.. ఎవరైనా కిడ్నాప్ చేసిన పాపను వీరు కొన్నారా..ఆ పాప అసలైన తల్లిదండ్రులు ఎవరనేది పోలీసులు క్షేత్రస్థాయిలో విచారణ చేస్తేనే వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ప్రాథమిక విచారణ ప్రకారం మేడ్చల్ జిల్లా కొంపల్లిలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఆయాగా పనిచేసే రాణినే తమకు ఆ బిడ్డను ఇచ్చిందని భోజనీ దంపతులు చెప్పారు. ఆ రాణి మరో మహిళ మంచిర్యాలకు చెందిన కృష్ణవేణి నుంచి తీసుకున్నానని చెప్పడంతో దీని వెనుక పెద్ద రాకెట్ ఏమైనా ఉందనే అనుమానాలు కలుగుతున్నాయి. ఎందుకంటే ఆ పాప వద్ద లభించిన ఆధార్ కార్డులు పరిశీలిస్తే హైదరాబాద్‌లో ఉంటున్న గుజరాతీయుల పాపగా తెలుస్తుంది. వారిని కూడా అదుపులోకి తీసుకొని విచారిస్తే అసలు తల్లిదండ్రులు ఎవరనేది తెలిసే అవకాశముంది.

తెలిసీ మరీ తప్పు చేశారు...

అమెరికాలో స్థిరపడిన కొంపల్లి వాసి కరీమ్‌విరాణి, వరంగల్‌లో అత్తారింట్లో ఉంటున్న అతడి చెల్లెలు రషీదాభాను భోజనీ అన్నాచెల్లెలు. అయితే ఉద్యోగ రీత్యా అమెరికాకు వెళ్లిన కరీమ్ విరాణి అమెరికా సిటిజన్ అయిన ఆశామావిరాణిని పెళ్లి చేసుకొని అక్కడే ఉంటున్నారు. వీరికి పిల్లలు లేకపోవడంతో ఎంబసీస్‌లోని ఫారెన్ ఆథరైజ్డ్ ఏజెన్సీ (ఆపా) వద్ద పిల్లలు దత్తత కావాలంటూ రిజిస్ట్రేషన్ చేసుకున్నా బతికున్న తల్లిదండ్రుల నుంచి పిల్లల్నీ దత్తత తీసుకునేందుకు వీల్లేదని పేర్కొంది. అందుకే 8 నెలల క్రితం భారత్‌కు వచ్చిన వీరు.. ఓ ఆరు నెలల పాప జనన ధ్రువీకరణ పత్రాలతోపాటు వీసా తీసుకొని అమెరికా వెళ్లబోగా అక్కడా ఇమ్మిగ్రేషన్ అధికారులు తిరస్కరించారు. అప్పటికే అన్న కోరిక మేరకు ఆ పాప తనకు పుట్టినట్టుగానే ఇన్నాళ్లూ చెప్పుకున్న రషీదాభాను భోజనీ సీడబ్ల్యూసీ ఎదుట బుధవారం మాత్రం తప్పు ఒప్పుకుంది. ఆ పాప తనకు జన్మించలేదని చెప్పారు. దీంతో వరంగల్‌లోని పోలీసు కమిషనరేట్ కార్యాలయానికి వెళ్లిన వీరు.. కొంపలిలోని కరీమ్ విరాణి, ఆశామావిరాణితోపాటు ఆరు నెలల పాపను తీసుకురావాలని పట్టుబట్టడంతో వారికి సమాచారం ఇచ్చారు. ఇలా వారు కారులో మధ్యాహ్నం మూడు గంటలకు కమిషన రేట్‌కు చేరుకోగా.. అక్కడా వారితో మాట్లాడిన తర్వాత సాయంత్రం ఆరు గంటల ప్రాంతంలో సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ వసుధ, జిల్లాల బాలల సంరక్షణ విభాగ బృందంతోపాటు విరాణి, భోజనీ దంపతులు పాపతో మట్టెవాడ పోలీసు స్టేషన్‌కు చేరుకున్నారు. అక్కడ సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జేజే యాక్ట్ 81 సెక్షన్ కింద అక్రమ దత్తత వ్యవహారంలో భోజనీ, వీరాణి దంపతులపై కేసు నమోదు చేశారు. అనంతరం పోలీసుల సమక్షంలో సీడబ్ల్యూసీ ఆదేశాల మేరకు ఆ పాపకు వైద్య పరీక్షలు చేసి హనుమకొండలోని శిశు విహార్‌కు తరలించారు. అయితే, కొంపల్లిలో తల్లిదండ్రులు ఉండడంతో రషీదాభాను భోజనీ అక్కడికెళ్తుండేది. అక్కడ ప్రార్థనా మందిరానికి వెళ్లిన సందర్భంలో ఓ ఆస్పత్రిలో పనిచేసే ఆయా రాణితో పరిచయం ఏర్పడింది. ఈ సమయంలోనే అన్న కరీమ్ విరాణికి పాప కావాలని ఆమెకు ఓసారి చెప్పడంతో రోజుల పసికందును తీసుకొచ్చి భోజనీకి ఇచ్చింది. ఆ తర్వాత కొంపల్లికి వచ్చిన విరాణి దంపతులకు ఇచ్చానని భోజని సీడబ్ల్యూసీకి వివరించారు.

సాక్షి ఎఫెక్ట్..



'సాక్షి'లో ప్రచురితమైన కథనం

అదుపు తప్పి.. గోడను ఢీకొన్న జీపీ ట్రాక్టర్

- తాత్కాలిక డ్రైవర్‌కు తీవ్రగాయాలు..
- ఆస్పత్రికి తరలింపు

దుగ్గొండి: జీపీ ట్రాక్టర్ అదుపు తప్పి గోడను ఢీకొంది. దీంతో తాత్కాలిక డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈ ఘటన బుధవారం మండలంలోని దేశాయిపల్లిలో జరిగింది. పారిశుధ్య కార్మికులు సమ్మెలో ఉండడంతో స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు చెత్త తరలింపు కోసం జీపీ ట్రాక్టర్ నడపడానికి తాత్కాలిక డ్రైవర్‌గా నల్లబెల్లి సురేశ్‌ను నియమించారు. మధ్యాహ్నం చెత్తను తరలిస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి మురుగుకాలువలోకి దూసుకెళ్లి గోడను ఢీకొంది. ఈ ఘటనలో డ్రైవర్ సురేశ్‌కు స్టీరింగ్ బలంగా తాకింది. దీంతో చికిత్స నిమిత్తం సురేశ్‌ను వెంటనే వరంగల్‌కు తరలించారు.

పరీక్షలో ఫెయిలయ్యానని.. విద్యార్థి బలవన్మరణం

కాజీపేట: పరీక్షల్లో ఫెయిలయ్యానని మనస్తాపానికి గురైన ఓ విద్యార్థి.. ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన బుధవారం కాజీపేట పట్టణంలోని 63వ డివిజన్ మహంకాళమ్మ దేవాలయ గల్లీలో జరిగింది. ఓదెల శ్రీరామ్ (20) రాంపురం గ్రామంలోని వీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మంగళవారం వెలువడిన ఫలితాల్లో ఫెయిలయ్యాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీనిపై మృతుడి తండ్రి రమేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని కాజీపేట సీఐ రాజు తెలిపారు.


శ్రీరామ్ (ఫైల్)

శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి

- టీఎస్ఎస్పీ బెటాలియన్స్ ప్రత్యేక డీఐజీ షర్ఫొద్దీన్ సిద్ధిఖీ


ఆయుధ గదిని పరిశీలిస్తున్న టీఎస్ఎస్పీ ప్రత్యేక డీఐజీ షర్ఫొద్దీన్ సిద్ధిఖీ

మామునూరు: శాంతిభద్రతలపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వ గుణాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టిందని టీఎస్ఎస్పీ బెటాలియన్స్ ప్రత్యేక డీఐజీ షర్ఫొద్దీన్ సిద్ధిఖీ తెలిపారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్ఎస్పీ 5వ బెటాలియన్‌ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా 2022–2023 సంవత్సరానికి సంబంధించిన తనిఖీలు నిర్వహించారు. అంతకు ముందు స్పెషల్ పోలీసులు డీఐజీకి గౌరవందనం సమర్పించారు. అనంతరం బెటాలియన్ అధికారులు, సిబ్బంది వివరాలు, అందుబాటులోనున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం టీఎస్ఎస్పీ పటిష్టం, స్పెషల్‌పోలీసుల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. అధికారులు, సిబ్బంది మరింత కష్టపడి పనిచేసి పోలీస్‌శాఖకు మరింతం పేరు తీసుకురావాలని సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జ్ కమాండెంట్ పెద్దబాబు, అసిస్టెంట్ కమాండెంట్ సోని, శ్రీధర్‌రాజు, ఆర్ఐలు కార్తీక్, సోలమన్ రాజు, శ్రీనివాస్, రాంప్రసాద్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థుల పరారీపై అధికారుల విచారణ

సాక్షి ఎఫెక్ట్..

ఏటూరునాగారం: ములుగు మండలం మల్లంపల్లి శివారులో ఓ ప్రైవేట్ భవనంలో కొనసాగుతున్న ఏటూరునాగారం మండలానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల నుంచి ఆదివారం మధ్యాహ్నం 8 మంది విద్యార్థులు పరారయ్యారు. జిల్లాలో ఆందోళన కలిగించిన ఈ ఘటనపై 'సాక్షి'లో 'గురుకులం నుంచి విద్యార్థులు పరార్' అనే శీర్షికతో మంగళవారం కథనం ప్రచురితమైంది. ఈ కథనానికి స్పందించిన ఐసీపీఎస్ అధికారులు బుధవారం మండల కేంద్రానికి చేరుకున్నారు.ఈ సందర్భంగా విద్యార్థులతోపాటు తల్లిదండ్రులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల శరీరంపై ఏర్పడిన గాయాలను పరిశీలించారు. నివేదికను ఉన్నతాధికారులుకు అందజేస్తామని తెలిపారు. కాగా, ఈనెల 10వ తేదీన పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎనిమిది మంది విద్యార్థులు మద్యం సేవించారనే నెపంతో పీఈటీ కార్తీక్ చితకబాదారు. తాము కూల్ డ్రింక్‌మాత్రమే తాగామని, మద్యం సేవించలేదని చెప్పినా వినకుండా తీవ్రంగా కొట్టడంతో భయాందోళనకు గురైన విద్యార్థులు గురుకులం నుంచి పారిపోయినట్లు తెలిపారు. ఇదిలా ఉండగా పారిపోయిన విద్యార్థులు తల్లిదండ్రుల వద్దకు చేరడంతో ఊపిరి పీల్చుకున్నారు.

ఉపాధ్యాయుల పర్యవేక్షణ లోపమే:

విద్యార్థుల పరారీ ఘటనపై తల్లిదండ్రుల ఆరోపణ

ములుగు రూరల్: ములుగు మండలం మల్లంపల్లిలో అద్దె భవనంలో కొనసాగుతున్న ఏటూర్‌నాగారం మండలానికి చెందిన సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులు మద్యం సేవించి ఉపాధ్యాయులకు పట్టుబడిన ఘటన విదితమే. మద్యం సేవిస్తూ విద్యార్థులు పట్టుబడగా పీఈటీ మందలించారు.దీంతో విద్యార్థులు ఆదివారం మధ్యాహ్నం పాఠశాల నుంచి పారిపోయారు. దీనిపై ఉపాధ్యాయులు.. తల్లిదండ్రులకు సమాచారం అందించి విషయం తెలిపారు. దీంతో తల్లిదండ్రులు మంగళవారం విద్యార్థులను తీసుకుని పాఠశాలకు వచ్చారు. పర్యవేక్షణ లోపంతోనే విద్యార్థులు పరారయ్యారనే ఆరోపణలను స్వీకరించని ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో వాగ్వాదానికి దిగినట్లు సమాచారం. మద్యం సేవిస్తూ పట్టుబడిన 9 మంది విద్యార్థులకు టీసీ ఇచ్చి పాఠశాల నుంచి పంపినట్లు సమాచారం .

విలేకరులను అనుమతించొద్దు..

గురుకుల పాఠశాలకు విలేకరులను అనుమతించొద్దని ప్రిన్సిపాల్ అంకయ్య.. సెక్యూరిటీ గార్డుకు హుకుంజారీ చేశారు. దీంతో బుధవారం పాఠశాల సందర్శనకు వెళ్లిన విలేకరులను సెక్యూరిటీ గార్డు అడ్డుకున్నారు. పాఠశాలలోని వసతులు, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే విలేకరులను పాఠశాలకు అనుమంతిచకపోవడం సరికాదని, ఉన్నతాధికారులు స్పందించాలని పలువురు కోరుతున్నారు.

నేడు ప్రిన్సిపాళ్లకు అవగాహన

కేయూ క్యాంపస్: విదేశాల్లో విద్యనభ్యసించే విద్యార్థులకు ఇంగ్లిష్ లాంగ్వేజ్ క్వాలిఫికేషన్ స్కాలర్‌షిప్స్ (2023–2024) ఆవిష్కరణపై విశ్వవిద్యాలయాల అనుబంధ కళాశాలల ప్రిన్సిపాళ్లకు గురువారం 11 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కేయూలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ టి శ్రీనివాస్‌రావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర భూపరిపాలన కమిషనర్ నవీన్ మిట్టల్, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచా ర్య ఆర్ లింబాద్రి, వీసీ ఆచార్య తాటికొండ రమేశ్ పాల్గొంటారని తెలిపారు.

ఆర్టీసీ అప్పను ఈక్విటీగా మార్చాలి

- బడ్జెట్‌లో 2 శాతం నిధులు కేటాయించాలి
- ఆర్టీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి


కలెక్టరేట్‌లో అధికారికి వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ జేఏసీ నాయకులు

హన్మకొండ : టీఎస్ ఆర్టీసీ అప్పును ప్రభుత్వ ఈక్విటీగా మార్చాలని, రాష్ట్ర బడ్జెట్‌లో ఆర్టీసీకి 2 శాతం నిధులు కేటాయించాలని ఆర్టీసీ జేఏసీ వరంగల్ రీజియన్ చైర్మన్ ఎం.శ్రీనివాస్, కన్వీనర్ టి.ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈమేరకు ఆర్టీసీ సమస్యలు ప్రభుత్వానికి తెలపాలని కోరుతూ బుధవారం హనుమకొండ కలెక్టరేట్ అధికారికి వినతిపత్రం అందించినట్లు వారు ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఏర్పాటై పది సంవత్సరాలు అవుతున్నా రాష్ట్రంలో ఆర్టీసీ పరిస్థితి మారలేదని ఆందోళన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో వేలాది మంది కార్మికులకు తీవ్ర మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. 2017 వేతన సవరణ చేయకుండా, వేతనాలు పెంచకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని వాపోయారు. కార్మికుల సొసైటీకి చెందిన రూ .3700 కోట్లు యాజమాన్యం వినియోగించుకుని కార్మికుల ఆర్థిక అవసరాలకు నిధులు లేకుండా చేసిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ స్పందించి కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి 2017, 2021 వేతన సవరణ ఒప్పందాలను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సీహెచ్ రామచందర్, టి.శ్రీనివాస్, ఎ.మురళి, పి.కె.మూర్తి, వి.సి.కుమార్, పి.ప్రభాకర్, వి.బాలయ్య పాల్గొన్నారు.

పీహెచ్‌డీ అభ్యర్థులకు శుభవార్త..

- ప్రవేశాలకు ఇంటర్వ్యూ షెడ్యూల్ విడుదల

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీలో పీహెచ్‌డీ ప్రవేశ పరీక్ష రాసి ప్రవేశాల కోసం వేయికండ్లతో ఎదురు చూస్తున్న అభ్యర్థులకు శుభవార్త.. పీహెచ్‌డీ రెండో కేటగిరీలో ప్రవేశాలకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు అధికారులు ఎట్టకేలకు బుధవారం షెడ్యూల్ విడుదల చేశారు. కాగా, పీహెచ్‌డీ ప్రవేపరీక్ష నిర్వహించి ఫలితాల అనంతరం అర్హత సాధించిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరించి రెండునెలలు గడిచాయి. దీంతో ఇంటర్వ్యూల కోసం అభ్యర్థులు సుదీర్ఘకాలంగా ఎదురు చూశారు. ఈ నేపథ్యంలో చివరకు ప్రవేశాలకు ఇంటర్వ్యూ షెడ్యూల్ ఖరారు చేసినట్లు విశ్వవిద్యాలయాల అడ్మిషన్ల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్ వాసుదేవ రెడ్డి వెల్లడించారు.

విభాగాల వారీగా ఇంటర్వ్యూల తేదీలు..

ఇంగ్లిష్ ఈనెల 20, 21, తెలుగు 22, 23, కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ 20, 21, ఈఐఈ(ఇంజనీరింగ్)20, ఈసీఈ 20, సివిల్ ఇంజనీరింగ్ 20, మెకానికల్ ఇంజనీరింగ్ 21, సీఎస్ఈ 21, 22 , ఫార్మసీ 24, 25, హిస్టరీ 22, టూరిజం మేనేజ్‌మెంట్ 22, ఎకనామిక్స్ 22, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ 23, హెచ్‌ఆర్ఎం 23, సోషియాలజీ 24, సోషల్ వర్క్ 24, పొలిటికల్ సైన్స్ 25, జియాలజీ 22, కెమిస్ట్రీ 22, బయోటెక్నాలజీ 23 , మైక్రో బయాలజీ 23, స్టాటిస్టిక్స్ 24, మ్యాథమేటిక్స్ 24, కంప్యూటర్ సైన్స్ 25, ఫిజిక్స్ 25, జువాలజీ 26, 27, లా 25, ఫిజికల్ ఎడ్యుకేషన్ 25వ తేదీల్లో నిర్వహించేందుకు సంబంధిత విభాగాల డీన్‌లు నిర్ణయం తీసుకున్నారని వాసుదేవరెడ్డి తెలిపారు. మరిన్ని వివరాలు ఈ నెల 4వ తేదీన విశ్వవిద్యాలయ వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కాకతీయ. ఏసి.ఇన్‌లో వివరాలు పొందుపరుస్తామని తెలిపారు. ప్రొఫెసర్లు బన్న అయిలయ్య, మనోహర్, కిషన్, మల్లారెడ్డి, నర్సింహారెడ్డి, అమరావేణి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణం కిస్తీలు చెల్లించాలని ఫేక్‌కాల్స్

- పోలీసులను ఆశ్రయించిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు

మహబూబాబాద్ రూరల్: ప్రభుత్వ ఉపాధ్యాయుడు తీసుకున్న రుణం కిస్తీలు కట్టడంతో కాస్త ఆలస్యమైంది. ఈక్రమంలో కిస్తీలు చెల్లించాలని, లేని పక్షంలో విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామని ఫేక్‌కాల్స్ ద్వారా బెదిరించిన ఘటన బుధవారం మానుకోటలో జరిగింది. ఈక్రమంలో వచ్చినవి ఫేక్‌కాల్స్ అని తెలుసుకున్న సదరు ఉపాధ్యాయుడు తోటి ఉపాధ్యాయులతో కలిసి పోలీసులను ఆశ్రయించాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మహబూబాబాద్ మండలంలోని ఓ ప్రభుత్వ పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు ఓ ప్రైవేట్ రుణ కంపెనీ నుంచి సుమారు రూ.4లక్షల రుణం తీసుకున్నాడు. నెలనెలా కిస్తీలు చెల్లిస్తున్నాడు. ఈక్రమంలో కొంతకాలంగా సదరు ఉపాధ్యాయుడు ఆరోగ్యం బాగోలేక ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంకా నాలుగు కిస్తీలు పెండింగ్‌లో ఉన్నాయి. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తి ఉపాధ్యాయుడికి ఫేక్ కాల్స్ చేయడం ప్రారంభించాడు. కిస్తీలు కట్టడం లేదని విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామని, వారు వచ్చి సస్పెండ్ చేస్తారని, పోలీసులు అరెస్టు చేస్తారని ఆగంతకుడు బెదిరించాడు. దీంతో భయాందోళనకు గురైన సదరు ఉపాధ్యాయుడు తమ తోటి ఉపాధ్యాయులతో చర్చించాడు. వెంటనే వారు విద్యాశాఖ ఉన్నతాధికారులకు ఫోన్ చేసి జరిగిన విషయం చెప్పారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు రుణం తీసుకున్న విషయంపై తాము ఎలాంటి చర్యలు తీసుకోబోమని, అది ఆయన వ్యక్తిగతమని సమాధానం ఇచ్చారు. దీంతో ఆయనకు వచ్చినవి ఫేక్ కాల్స్ అని గుర్తించి పోలీసులను ఆశ్రయించాడు.

బ్యాగుల్లో తీసుకొచ్చే పత్తి కొనాలి

- చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి


సీసీఐ సీఎండీకి వినతి పత్రం అందజేస్తున్న చాంబర్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

వరంగల్: రైతులు వ్యవసాయ మార్కెట్‌లకు బ్యాగుల్లో తీసుకు వస్తున్న పత్తిని కొనుగోలు చేయాలని వరంగల్ వరంగల్ చాంబర్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, తెలంగాణ కాటన్ మిల్లర్స్ అండ్ ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మినేని రవీందర్‌రెడ్డి అన్నారు. ఈమేరకు బుధవారం ముంబైలో కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సీఎండీ లలిత్ కుమార్ గుప్తాను కలిసి తెలంగాణ రాష్ట్రంలో పత్తి ఉత్పత్తి చేసే చిన్న, సన్నకారు రైతులు, కాటన్ జిన్నింగ్ అండ్ ప్రెస్సింగ్ పరిశ్రమల సమస్యలు వివరించారు. చిన్న, సన్నకారు రైతులు 5 నుంచి 10 టన్నుల పత్తిని బ్యాగులలో తీసుకొని వస్తే సీసీఐ అధికారులు కొనుగోలు చేయడం లేదన్నారు. దీంతో వారికి లాభం కలగడం లేదన్నారు. దీనిపై స్పందించి ఆ రైతులకు మినిమం సపోర్ట్ ప్రైస్(ఎంఎస్పీ) వర్తింపజేయాలన్నారు. అలాగే, జిన్నింగ్ పరిశ్రమలలో కాటన్ బేల్స్‌తో సమానంగా పత్తి గింజలను కూడా వెనువెంటనే జాప్యం లేకుండా లిఫ్ట్ చేయాలని కోరారు. సీసీఐ పత్తిని జిన్నింగ్ చేసే క్రమంలో వెలువడే ట్రాష్(చెత్త)పర్సంటేజ్ నిర్ధయించడానికి శాంపిల్స్ తీసి లాబరేటరీకి ఒకటి రెండు రోజులలో పంపించి ల్యాబ్ రిపోర్టు 15 రోజులలో ఫలితాలను జిన్నింగ్ మిల్లుల యాజమాన్యానికి తెలపాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలపై సీసీఐ సీఎండీ లలిత్ కుమార్ గుప్తాతో పాటు ఉన్నతాధికారులు ప్రదీప్ కుమార్ అగర్వాల్, పాణిగ్రాహి సానుకూలంగా స్పందించినట్లు రవీందర్‌రెడ్డి తెలిపారు.

కేసీఆర్ దృష్టికి మత్స్యకారుల సమస్యలు..

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్


మాట్లాడుతున్న శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్

హన్మకొండ చౌరస్తా: ఉచిత చేప పిల్లల పంపిణీకి బదులు నగదు అందజేయాలనే మత్స్యకారుల వినతిని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి అమలయ్యేలా తన వంతు కృషి చేస్తానని శాసనమండలి డిప్యూటీ చైర్మన్ డాక్టర్ బండా ప్రకాశ్ అన్నారు. బుధవారం హనుమకొండ కాకతీయకాలనీలోని గంగా గార్డెన్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్యపారిశ్రామిక సహకార సంఘం జనరల్ బాడీ సమావేశం సంఘం అధ్యక్షుడు బుస్సా మల్లేశం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి బండా ప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ ఏడాది డిసెంబర్‌తో ఉమ్మడి వరంగల్ జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కాలపరిమితి ముగుస్తుండడంతో త్వరలోనే నూతన కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తెలంగాణ మత్స్య సహకార సమాఖ్య చైర్మన్ పిట్టల రవీందర్ మాట్లాడుతూ చేపల పంపిణీలో నాణ్యత, సైజును మత్స్యకారులు దగ్గరుండి పరిశీలించుకోవాలన్నారు. చెరువుల పరిరక్షణ మత్స్యకారులదే అన్న ఆయన.. ప్రతి విషయంలో సర్కార్ ను నిందించడం మానుకుని చెరువును కాపాడుకుంటూ అభివృద్ధి చేసుకోవాలన్నారు. త్వరలోనే ప్రభుత్వం ఓ బృహత్తర కార్యక్రమం చేపట్టబోతుందన్నారు. చేపల ఉత్పత్తితో పాటు కొనుగోలును సైతం ప్రభుత్వమే జరిపేలా ప్రణాళిక రూపొందిస్తుందన్నారు.

రాష్ట్రంలో ఆక్వా కల్చర్ అభివృద్ధి

- ఫిషరీస్ ఫెడరేషన్ చైర్మన్ రవీందర్


మాట్లాడుతున్న రవీందర్

హన్మకొండ: రాష్ట్రంలో ఆధునిక విధానాలను అనుసరించి ఆక్వా కల్చర్ రంగాన్ని అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ సమగ్ర అధ్యయనం చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ఫిషరీస్ ఫెడరేషన్ రాష్ట్ర చైర్మన్ పిట్టల రవీందర్ తెలిపారు. బుధవారం హనుమకొండలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని చెరువులు, కుంటలు, రిజర్వాయర్లు, ఇతర నీటి వనరుల్లో సంప్రదాయ విధానాలను అనుసరిస్తూ అనేక తరాలుగా చేపల పెంపకాన్ని నిర్వహిస్తున్నారన్నారు. ఈ వృత్తిలో ఆధునిక పరిజ్ఞానం జోడించాలని నిర్ణయం తీసుకున్నామన్నారు. మత్స్యకారులు ఆధునిక పద్ధతులను పాటిస్తూ నిర్వహించే ఆక్వా కల్చర్ జల సేద్యంలో అవసరమైన ప్రావీణ్యం అందించేందుకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా చేపల ఉత్పత్తి, ఉత్పాదకతను సాధించడానికి ఈ ఆక్వా రంగం దోహదం చేస్తుందన్నారు. సంప్రదాయ పద్ధతుల్లో చేపల పెంపకం ద్వారా ఒక హెక్టార్‌కు కేవలం టన్ను చేపలను మాత్రమే ఉత్పత్తి చేసేందుకు అవకాశాలు ఉండగా.. ఆధునిక ఆక్వా కల్చర్ విధానాలను అనుసరించడం ద్వారా ప్రతి హెక్టార్‌కు మూడు నుంచి ఐదు టన్నుల చేపలను ఉత్పత్తి చేయొచ్చన్నారు. ఈ పద్ధతులతో తక్కువ నీటి విస్తీర్ణంలో ఎక్కువ చేపలను ఉత్పత్తి చేయొచ్చన్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆక్వా కల్చర్ పరిశ్రమలను నిర్వహించేందుకు చాలా అవకాశాలున్నాయన్నారు. చేపలను శుద్ధి చేయడం, చేపల ఆహార ఉత్పత్తులను తయారు చేసే మధ్యతరహా, చిన్న తరహా పరిశ్రమలను నెలకొల్పేందుకు ఉమ్మడి వరంగల్ జిల్లాను అత్యంత అనువైన ప్రదేశంగా గుర్తించినట్లు చెప్పారు.